కథ

# ఆశ్రమ జీవనం

యం. పార్వతీ మోహన్

సుమిత్రకి పొద్దుట్నించి మనసేంబాగలేదు. అన్నీ యాంత్రికంగా చేస్తోంది. ఒక్క పప్పు మాత్రం వండి, పిల్లల్ని శ్రీవారినీ బళ్లోకి, ఆఫీసుకి పంపించేసింది. తలంతా చికాకుగా ఉంది. తలదువ్వుకో బుద్ధి కావటం లేదు. అట్లాగే మంచం మీద పడుకొని తిరుగుతున్న సీలింగ్ ఫాన్నే చూస్తోంది. తనకి తెలియకుండానే కళ్ళల్లోంచి నీళ్ళు కారిపోతున్నాయి. సుమిత్ర ఆశ్చర్య పడింది. తనేం దుఃఖంగా లేదు. మరెందుకీ కన్నీళ్ళు? ఏదో నిర్లిప్తత!

కాలింగ్ బెల్ మోగుతుంటే లేచింది. నిద్రపోయి ఫ్రెష్గా లేచినట్లు లేదు. ఏదో యుద్ధం చేసి అలసిపోయినట్లుంది వళ్ళంతా; అట్లాగే లేచి తల, చీర సర్దుకుంటూ వెళ్ళి తలుపు తీసింది సుమిత్ర. వచ్చింది తన తండ్రి రాఘవరావు. చేతిలో చిన్న లెదర్బాగ్తో వచ్చాడు. తండ్రిని చూడగానే చల్లనిగాలి తాగి సేద తీరినట్లనిపించింది సుమిత్రకు.

"రండి నాన్నా, అమ్మ ఎట్లా ఉంది?" అంటూ లోపలికి నడిచింది. "ఆఫీసు పనిమీద వచ్చానమ్మా అమ్మకేం బాగానే ఉంది అవునూ అట్లా ఉన్నావేంటి? ఒంట్లో బాగా లేదా?" అంటూ కూర్చుంటూ చుట్టూ చూసి ఆశ్చర్యపోయాడు. బట్టలు, పుస్తకాలు ఎక్కడపడితే అక్కడున్నాయి. సుమిత్రకూడా ఎప్పుడూ కడిగిన ముత్యంలా ఉండేది. ఈ రోజు తల కూడా దువ్వుకోకుండా వేలుముడితోనే ఉంది. నీరసంగా కనిపిస్తోంది.

"ఏంటే జ్వరం కానీ వచ్చిందా? అట్లా ఉన్నావు?" అంటూ నుదిటిమీద చెయ్యి పెట్టి చూశాడు.

"అదేం లేదు నాన్నా ఏంటో బద్ధకంగా ఉంది, ఉండండి. కాఫీ కలుపుతా. కాసేపయ్యాక భోంచేయ్యొచ్చు," అంటూ వంటింట్లోకెళ్ళింది సుమిత్ర.

రాఘవరావు ఆలోచనలో పడ్డాడు. అల్లుడు మంచివాడు, ఏదురలవాట్లు లేవు. కాకపోతే బాధ్యతాయుతమైన ఆఫీసరు కనుక ఇంట్లో ఎక్కువ సమయం గడపలేడు. ఒక ఆడపిల్లా ఒక మగ పిల్లాడు. మగ పిల్లాడు పదో తరగతి చదువుతున్నాడు. ఆడపిల్ల నాలుగో తరగతి. ఇద్దరూ బాగా చదువుతున్నారు. సుమిత్రకి చెప్పుకోతగ్గ సమస్యలేమీ లేవు. అయినా ఎందుకిట్లా ఉంది? ముఖం చూస్తే ఏడ్చినట్లుగా ఉంది. ఏదో ఉంది. ఎలాగైనా అదేంటో తెలుసుకోవాలి, అనుకుంటూ వంట ఇంట్లోకెళ్లాడు, కాఫీ కప్పుల్లో పోసి వంకాయలు, కత్తి పీట తీసుకొని హాల్లో కోస్తోంది సుమిత్ర.

"వద్దమ్మా ఇప్పుడేం కూర చెయ్యద్దు. ఏది ఉంటే అది తిందాము. దా కూర్చో మాట్లాడు. చాలా రోజులయింది మనసిప్పి మాట్లాడుకుని" అంటూ కాఫీ తీసుకొని వచ్చి కూర్చున్నాడు తండ్రి.

సుమిత్రకీ అట్లాగే ఉంది. ఎప్పుడొచ్చినా ఏదో హడావుడి. కాసేపు నాన్నతో మాట్లాడితే మనసు కుదుట పడుతుంది," అనుకుంటూ వచ్చికూర్చుంది.

"ఏంటమ్మాపిల్లలు బాగా చదువుతున్నారా? ఏమిటి సంగతులు?" కాఫీ తాగుతూ అడిగాడు రాఘవరావు గారు.

"ఏం లేదు అంతా బాగానే ఉన్నారు. ఈ మధ్య 'పార్థుడికి ఫస్ట్ మార్కులే వస్తున్నాయి," అంటూ ఆగింది తండ్రి తననే గమనిస్తున్నాడని తెలుసుకొని,

"ఏం లేదు నాన్నా అందరూ ఏదో ఒక పనిచేస్తున్నారు. డబ్బు సంపాదిస్తున్నారు. నాకే దేనికీ తీరటం లేదు. లేచింది మొదలుకొని పనులు. ఉద్యోగానికి తగిన అర్హతా లేదు. మామూలు గృహిణిగా జీవితం గడిచిపోతోంది. సమయమంతా వృధా అయిపోతోందనీ, ఏమీ చెయ్యలేక పోతున్నానని. నా వల్ల ఎవరికీ ఏ ప్రయోజనము లేదనీ దిగులుగా ఉంది. కనీసం ఏదైనా పుణ్య తీర్థాలకెళ్దామన్నా ఆయనగారికి తీరదు. ఇటు ఇహానికి డబ్బు సంపాదించటం లేదు అటు పరానికి పుణ్యం సంపాదించటం లేదు. నాకు దొరికిన అపురూపమయిన ఈ మానవ జన్మని వృధా చేస్తున్నానని గిల్టీగా ఉంది" అంటూ ఆగింది.

ఆమె గొంతులోని సిన్సియారిటీకి చలించిపోయాడు తండ్రి.

"ఓస్ ఇంతేనా" అంటూ టీపాయ్ మీద వున్న పేపర్ చేతిలోకి తీసుకున్నాడు రాఘవరావు.

"మీకట్లాగే ఉంటుంది. నాకేమో అనుక్షణం ఇదే ఆలోచన. ఈ పనులెపుడయిపోతాయో గానీ సన్యాసం పుచ్చుకుని ఏదైనా మంచి ఆశ్రమంలో చేరాలని ఉంది. నిశ్చింతగా దైవధ్యానం చేసుకుంటూ పుస్తకాలు చదువుకుంటూ గడపొచ్చు."

అంటూ కప్పులు తీసుకొని వంటింట్లోకి వెళ్లింది సుమిత్ర. రాఘవరావు పేపరు మడిచి వెనక్కివాలి కళ్లు మూసుకొని కాసేపు ఆలోచనలో పడ్డాడు.

కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చిన సుమిత్ర కళ్లు మూసుకొని కూర్చున్న తండ్రిని చూసి రెస్టు తీసుకుంటున్నారేమోలే అనుకుని ముఖం కడుక్కొని, తల దువ్వుకొని, ఫ్రెష్గా తయారై వచ్చింది. ఇంకా అట్లాగే ఉన్న తండ్రితో "అన్నం తిందాంలే నాన్నా" అంటూ డైనింగ్ టేబుల్ సర్దసాగింది.

రాఘవరావు కళ్ళు తెరిచి "ఇప్పుడే ఆకలెయ్యటం లేదు. ఇంకో గంట పోయాక తిందాంలే. ఇటొచ్చి కూర్చో" అని పిలిచాడు.

"సరే" అంటూ వచ్చి కూర్చున్న సుమిత్రతో "గృహిణి జీవితం గడపటమంటే అంత చులకనగా ఉందా నీకు. ఇదేం తేలిక పని కాదే. నాకు తెలిసినంత వరకు బిల్లులు కట్టటం, సరుకులు తేవడం అన్నీ నువ్వే చేస్తున్నావు, నువ్వు అందరికంటే తక్కువ అని ఎందుకనుకుంటున్నావు" అంటున్న తండ్రిని,

"తక్కువ అని కాదు నా ఉద్దేశం. ఇంకా ఎక్కువగా చెయ్యలేక పోతున్నానే అని. ఉద్యోగస్థులు కూడా నా పనులన్నీ చేస్తున్నారు. కానీ నేను వాళ్ళలా ఉద్యోగం చెయ్యటం లేదు కదా. మరి నాకు మిగిలే కాలాన్ని నేను వృధా చేస్తున్నానని దిగులు" అంది.

"దిగులు పడాల్సిన పనేం లేదమ్మా నీవు చెయ్యాల్సిన పనులన్నీ చక్కగా చేస్తున్నావు. నువ్వు ఒక్కదానివీ ప్రశాంతంగా ఉండటంవల్ల ఇంట్లో అందరినీ ప్రశాంతంగా ఉంచుతున్నావు. నీవు కూడా వాళ్ళతో అలసిపోయి వస్తే వాళ్ళ అలసట తీర్చేదెవరు. మగవాడు బయటికెళ్తే ఎన్ని రకాల సమస్యల నెదుర్కుంటాడో నీకు తెలియదు. ఇంటి కొచ్చేసరికి ఏ సమస్యలూ లేని సంతోషకరమైన వాతావరణం నీవు కల్పిస్తే అతనికి వేయి ఏనుగుల బలం వస్తుంది. అందుకని పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు. చక్కగా అందరికీ అన్నీ అమరుస్తూ హాయిగా ఉండు" అన్నాడాయన. అది అంతగా నచ్చినట్లు లేదు సుమిత్రకి.

"అది సరేలే కానీ నాన్నా మంచి ఆశ్రమం ఎక్కడుందో చూడండి. కనీసం పదేళ్ల తర్వాతైనా వెళ్లటానికి ఉంటుంది" అంది.

"ఆశ్రమానికే వెళ్లాలని నీకెందుకనిపిస్తోంది. కావాలంటే అమ్మ దగ్గరికొచ్చి నాలుగు రోజులుండి వెళ్లు. రిలీఫ్ ఫీలవుతావు."

"కాదు, కాదు, ఆశ్రమం అయితే స్వార్థరహితంగా ఉండచ్చు - వాళ్లట్లా అన్నారని, వీళ్లిట్లా అన్నారని ఉండదు. వీళ్లకింత చేస్తున్నా మన మాట వినడం లేదే అని ఉండదు. ఎవరో మెచ్చుకుంటారని ఏదో చెయ్యటం, అది చేసినా ఎవరో ఒకరు బాగా లేదనటం లాంటి చికాకులు, పనివాళ్లు రాలేదని, సంసార జంఝాటనలు ఉండవు. హాయిగా ఆశ్రమంలో చెప్పిన పని చేసి నిశ్చింతగా భజన చేస్తూ ఉండచ్చు. మానసికమైన టెన్షన్ ఉండదుగా" అంది సుమిత్ర.


రాఘవరావు నవ్వుతూ "అదా నీ ఊహ. ఆ ఆశ్రమంలో ఎట్లా ఉండదలుచుకున్నావో అట్లా ఈ ఆశ్రమంలో కూడా ఉండవచ్చు. అందుకే దీన్ని పెద్దలు

గృహస్థాశ్రమం అన్నారు. తెలివైన వాళ్లు ఈ గృహాన్ని ఆశ్రమంలా తీర్చి దిద్దగలుగుతారు. ఎక్కడికో పోతే మనశ్శాంతి దొరుకుతుందని నీవనుకుంటున్నావు గానీ మనశ్శాంతి అనేది స్థలంలోనో కాలంతోనో ముడి పడి ఉండదు. అది మన మనసులోను మన ఆచరణలో దాగి ఉంటుంది. విశ్రాంతి, పని చెయ్యకుండా ఉండటంలోనో, మనశ్శాంతి - ఎదురు చెప్పే వాళ్లు లేనప్పుడో దొరికేది కాదు. చల్లని చిలికితేనే వెన్న వస్తుంది. చిలకనంత కాలం వెన్న చల్లలో దాగి ఉంటుంది. కానీ ఉందని కూడా తెలియదు" అని అంటూండగానే మధ్యలో ఆపి "అట్లా అయితే మునులందరూ అడవులకెళ్లి ఎందుకు తపస్సు చేశారు. ఎందుకు ఆశ్రమాలు అవీ పెట్టారు" అని చిన్నపిల్లలా అడుగుతున్న కూతుర్ని చూసి నవ్వుతూ.

"కొందరు అట్లాంటి జీవితాన్ని ఎన్నుకుంటారు. అట్లా అని అందరూ వెళ్లలేరు కదా. ఆశ్రమంలోని నియమబద్ధమూ, క్రమబద్ధమూ అయిన జీవితాన్ని ఇంట్లో గడిపితే ఇల్లే ఆశ్రమమవుతుంది. మీ అమ్మ చూడు ఏ పూజలు చేస్తున్నది, ఏ వ్రతాలు చేస్తున్నది, ఎన్నడైనా ముఖంలో విసుగు కనిపించిందా? తన పనే తన పూజ. తన పనిలో తన విద్యుక్త ధర్మ నిర్వహణలో ఏనాడూ అసంతృప్తిగానీ, విసుగుగానీ చూపించిందా?

"ఈ సృష్టి సరిగ్గా సాగాలంటే ఎన్నో రకాల పనులు జరగాలి. అన్నీ అందరూ సమతుల్యంగా చేస్తే సృష్టి సమంగా సాగుతుంది. అందుకే అందరూ ఒకే పని చెయ్యరు. పనిలో పెద్ద చిన్నా బేధం లేదు. పనిని బట్టి మనిషిని అంచనా వెయ్యరు. పనిచేసే విధం బట్టి గౌరవమర్యాదలు దొరుకుతాయి.

"తెలివిగా ఏ వయస్సులో మన కర్తవ్యం ఏమిటో, మన పాత్ర ఏమిటో గ్రహించి దాని కనుగుణంగా నడుచుకుంటే బావుంటుంది. ఎదురు దెబ్బలు, ఎగతాళి చేసే వాళ్లు లేకపోతే మన తప్పులేలా దిద్దు కుంటాము? మన ఇష్టమొచ్చినట్లు మనం వుండటం అంటే నిరంకుశత్వమన్నమాటే కదా! అందరు మన మాట విన్నారనుకో. అది వాళ్ల గొప్పతనమే, నీ గొప్పతనమేమిటి. అందరికీ అనుగుణంగా నీవు మసలుకోగలిగితే నీ గొప్ప. డక్కామొక్కీలు తిన్న జీవితమే సంపూర్ణ జీవితం. సన్యసించటం పిరికితనమవుతుంది. ఆశ్రమానికి వెళ్లడమంటే ఓడిపోయి పారిపోవటమన్న మాట" అంటూ ఆగాడు.



"అదేం కాదు నేను ఆడదాన్ని. నన్ను ఈ ఇంటికి పరిమితం చేశారు. అదే మగవాడైతే తెంచుకుని వెళ్లి సన్యాసుల్లో కలిసేవాడు. ఆడదాన్ని కావటం అన్నింటికీ అడ్డంకయింది" అంటూ లేచి వంటింట్లో కెళ్లింది. కంచాలు తీసుకుని వచ్చి టేబుల్ మీద పెట్టి నెయ్యి కరగ బెట్టుకొని వచ్చింది. "రండి నాన్నా భోంచేద్దాం" అంటూ వడ్డించసాగింది.

రాఘవరావు చెయ్యి కడుక్కుని వచ్చి అన్నం ముందు కూర్చుంటూ,

"పిచ్చి పిల్లా. ఆడపిల్లవి కావటమే నీ అదృష్టం. ఇంట్లో అత్తమామలని సేవిస్తూ పతికి తగినవన్నీ అమరుస్తూ ఆదర్శవంతంగా పిల్లల్ని, తీర్చిదిద్దుతూ అతిథి అభ్యాగతుల్ని ఆదరిస్తూ నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తిస్తూ ఇంటిని తీర్చిదిద్దవచ్చు. నీలా అన్నీ తెలిసిన వాళ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అంటూ అన్నం తింటూనే గమనిస్తున్నాడు సుమిత్రని.

"అన్నట్లు నీ పేరు సుమిత్ర అని ఎందుకు పెట్టమో తెలుసా?" అనడిగిన తండ్రి ప్రశ్నకి ఆశ్చర్యపోయింది సుమిత్ర. తన పేరులో ఏమంత ప్రత్యేకత లేదుకదా అనుకుంటూ.

"రామాయణంలో అందరికంటే గొప్ప పాత్ర సుమిత్రదే. కౌసల్యకి ఆమె కొడుకు రాముడున్నాడు. కైకేయికి భరతుడున్నాడు. సుమిత్ర మాత్రం లక్ష్మణుడిని రాముని సేవకు, శత్రుఘ్నుడిని భరతుని తోడుకి అర్పించేసింది. దశరథుడు కూడా పట్ట మహిషిగా కౌసల్యని, ముద్దుల రాణిగా కైకెయిని ఆదరించాడు. సుమిత్ర పట్ల ఏమాత్రం ప్రత్యేకత కనబర్చలేదు.

"అయినా ఆమె ఇసుమంతయినా కినుక లేకుండా తన విద్యుక్తధర్మ నిర్వహణలో లీనమయింది. తన కంటూ ప్రత్యేక స్థానం లేదని నేరారోపణ చెయ్యలేదు. నాకు సుమిత్రపై గౌరవం ఎక్కువ. అందుకే నీకా పేరు పెట్టాము." కొత్తగా నాన్న నోటి వెంట తన పేరుకి చెందిన ఫ్లాష్ బ్యాక్ వింటుంటే చేయి ఎండిపోయింది కూడా గమనించలేదు సుమిత్ర.

తండ్రి లేచి చేయి కడుకున్నాడు. తనుకూడా చేయి కడుక్కుని ఆలోచిస్తూనే టేబుల్ సర్దుతోంది.

"చూడమ్మా నా బస్సు టైం అవుతోంది. నేను వెళ్లాలి."

"పిల్లలొచ్చేదాకా ఉండండి నాన్నా."

"వద్దమ్మా మళ్లా నాలుగు రోజుల్లో వస్తాగా, అప్పుడు రెండు రోజులుంటాను. అల్లుడుగార్ని అడిగానని చెప్పు. ధైర్యంగా ఉండు. మొన్న నేనిచ్చిన వివేకచూడామణి చదువు," అని వెళ్లిపోతున్న తండ్రిని చూస్తూన్న సుమిత్ర మనసిపుడు మంచుకడిగిన మల్లెపూవులా ఉంది. నూతనోత్సాహంతో పరవళ్ళు తొక్కుతోంది. భర్తని, పిల్లల్ని తలచుకుని వాళ్లొచ్చేసరికి టిఫిన్ చేసి చక్కగా ఉండాలనుకుంటూ ఉత్సాహంగా లోపలికెళ్ళింది! ❑